క్లుప్తంగా

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా గోపాల్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాల్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఎ.సింహాచలంను ఉద్యోన్నతిపై విశాఖపట్నం ఏపీఐసీ జోనల్ మేనేజర్‌గా నియమించారు. గత కొన్నినెలల క్రితం తహసీల్దార్‌కు ఉద్యోగోన్నతి లభించింది.

విధుల్లో చేరిన ఎంపీడీఓ!

ఎచ్చెర్ల క్యాంపస్: గత కొన్ని రోజులుగా సెలవులో ఉన్న ఎంపీడీఓ సీపాన హరిహరరావు గురువారం విధుల్లో చేరారు. గత నెల 29వ తేదీ నుంచి ఈ నెల 10వ తేదీ వరకు సెలవు పెట్టారు. సంక్రాంతి సెలవులు తరువాత ఎంపీడీఓ కార్యాలయం ప్రారంభం కాగా.. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు, జోక్యంతో విధుల్లో చేరినట్లు సమాచారం. సెలవు పెట్టిన సమయంలో రణస్థలం ఎంపీడీఓకు ఇన్‌చార్జి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించగా.. ఆయన విధుల్లోకి చేరేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో పాలనాపరమైన సమస్యలు రావటం, ప్రగతి పనులపై ప్రభావం చూపటంతో ఎంపీడీఓగా హరిహరరావు బాధ్యతలు స్వీకరించారు.

ప్రభుత్వానివి ప్రజావ్యతిరేక విధానాలు



మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

జి.సిగడాం: కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామ్మూర్తి అన్నారు. గురువారం మండలంలోని విజయరాంపురం, దవళపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశాల్లో మాట్లాడారు. గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో పర్యటించి కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, నాయకులు కంచరాన రమణారావు, పేడాడ శ్యామలరావు, పేడాడ నారాయణరావు పాల్గొన్నారు.

ప్లాస్మాదానం



ప్లాస్మాదానం చేస్తున్న సతీష్

శ్రీకాకుళం కల్చరల్: పట్టణానికి చెందిన కోరాడ సతీష్ ప్లాస్మా దానం గురువారం చేశారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పూర్వపు కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ ప్రారంభించిన ప్లాస్మా కేంద్రంలో ఇప్పటివరకు వంద ప్లాస్మా డొనేషన్స్ సేకరించామని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. ఈ దాతలకు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్న నంది ఉమాశంకర్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పి.వైకుంఠరావు, కె.సత్యనారాయణ, ఆయుష్ బేగం, జగదీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వీజేకే మూర్తి మృతి తీరనిలోటు

పోలాకి: గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు, అభ్యుదయవాది వి.జె.కె.మూర్తి అకాల మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని గరిమెళ్ల మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్.ఎ భుక్త, బాడాన రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ పక్షపాతిగా వారి హక్కుల సాధన కోసం జరిగిన అనేక పోరాటాలకు మూర్తి అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు గరిమెళ్ల సత్యనారాయణ భావజాల వ్యాప్తికి ఆయన పేరుతో విజ్ఞాన కేంద్రం స్థాపించి సమకాలీన అంశాలపై ప్రజలను చైతన్యం చేశారన్నారు.

కబడ్డీ విజేత కొండపోలవలస



కబడ్డీ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సడగాన రవి, తదితరులు

నరసన్నపేట: మండలంలోని సుందరాపురంలో నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు బుధ, గురువారాల్లో ఉమామల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. 22 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో జలుమూరు మండలం కొండపోలవలసకు చెందిన జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్ కొండపోలవలస-రెడ్డికిపేట మధ్య జరిగింది. నరసన్నపేట మండలం రెడ్డికిపేట జట్టు ద్వితీయ స్థానం, జలుమూరు మండలం కూర్మనాథపురం జట్టు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు గ్రామస్తుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సడగాన రవి, తదితరులు బహుమతులు, నగదు అందించారు. ఇదే గ్రామంలో క్రికెట్ పోటీలు కూడా నిర్వహించారు. దీంట్లో జలుమూరు మండలం పర్లాం జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్ గొటివాడ-పర్లాం జట్ల మధ్య జరిగింది. పర్లాం జట్టు విజయం సాధించింది.

అంచనాలకే పరిమితం

- కోతకు గురవుతున్న నదీ తీరం
- గ్రోయిన్ల నిర్మాణం గాలికి..
- నదిలో కలిసిపోతున్న జిరాయితీ..
- పట్టించుకోని పాలకులు, అధికారులు



తమ్మినాయుడుపేట వద్ద నదీతీరం కోత

పొన్నాడ సమీపంలో కోతకు గురైన నదీతీరం

ఎచ్చెర్ల క్యాంపస్: నాగావళి నదీతీర భూములు ప్రతి ఏటా కోతకు గురవుతున్నాయి. రైతులు చాలాచోట్ల జిరాయితీని సైతం కోల్పోతున్నారు. ఈ సమయంలో పనులు చేపట్టేందుకు వీలున్నా.. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. ఎచ్చెర్ల మండలంలో నాగావళి నది తమ్మినాయుడుపేట, సనపలవానిపేట, తోటపాలెం, పొన్నాడ, తెప్పరేవు, బొంతలకోడూరు, పాతదిబ్బలపాలెం గ్రామాల్లో 40 కిలో మీటర్ల మేరకు ప్రవహిస్తోంది. తీర ప్రాంతం ప్రతి ఏటా కోతకు గురవుతోంది. గ్రోయిన్లు (రాతి కట్టడాలు) ప్రతి పాదనలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. కార్యరూపం మాత్రం దాల్చటం లేదు. దీంతో భూమికోత ప్రధాన సమస్యగా ఉంది.

ఇసుక అక్రమ మైనింగ్..

ప్రతి ఏటా జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నదీ ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో నదీతీర ప్రాంతం కోతకు గురవుతుంది. తమ్మినాయుడుపేట, పొన్నాడ, తదితర ప్రాంతాల్లో జీడిమామిడి, సరుగుడు, నీలగిరి వంటి తోటలు రైతులు సాగు చేస్తున్నారు. కోతతో చెట్లు కోల్పోతున్నారు. మరోపక్క జిరాయితీ భూముల కోత రైతులను కలిచి వేస్తోంది. గత 10 ఏళ్ల నుంచి గ్రోయిన్ల నిర్మాణం ప్రతిపాదనల్లో ఉంది. దీంతో పాటే సర్వే సైతం పూర్తయింది. అయినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. మరోపక్క తమ్మినాయుడుపేట, పొన్నాడ, బొంతలకోడూరు, తోటపాలెం సమీపంలో ఇసుక అక్రమ మైనింగ్ సైతం కోతకు ప్రధాన కారణం అవుతుంది. గతంలో ఈ ప్రాంతంలో మైనింగ్‌కు పర్యావరణశాఖ అనుమతులు సైతం ఇవ్వలేదు. అనధికార మైనింగ్ సాగుతోంది. నదీతీర ప్రాంతంలో గట్లు కరిగి భూముల కోత ఏర్పడుతుంది. ప్రధానంగా కోతకు గురవుతున్న ప్రాంతాల్లో జనవరి నుంచి జూన్ వరకు రాతి కట్టడాలు ఏర్పాటుచేస్తే సమస్యకు కొంతమేరకు పరిష్కారం లభించనుంది.

గ్రోయిన్లు ఏర్పాటు చేయాలి



నదీతీర ప్రాంతం ప్రతి ఏటా కోతకు గురవుతుంది. రైతులు జిరాయితీ భూములు సైతం కోల్పోతున్నారు. ప్రభుత్వం స్పందించి గ్రోయిన్లు ఏర్పాటు చేయాలి. కోతకు శాశ్వత పరిష్కారం చూపాలి. అనేకసార్లు ఇంజినీరింగ్ అధికారులు తీరాన్ని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. అయినా నిర్మాణానికి చర్యలు తీసుకోవటం లేదు.

– పంచిరెడ్డి రాంబాబు, సర్పంచ్, బొంతలకోడూరు, ఎచ్చెర్ల మండలం

దీర్ఘకాలిక సమస్య



నదీతీర ప్రాంతాల్లో ఇది శాశ్వత సమస్య. ప్రతి ఏటా నదీతీర భూములు కోతకు గురవుతున్నాయి. రాతి కట్టడాలు ఏర్పాటు చేయాలి, అప్పుడే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. లేదంటే ప్రతి ఏటా కోత తప్పదు. ప్రధానంగా కోత ప్రాంతాలు గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో నిర్మాణాలు చేపట్టాలి.

– సనపల సూరిబాబు, సనపలవానిపేట, ఎచ్చెర్ల మండలం

ప్రభుత్వం దృష్టి సారించాలి



ఎచ్చెర్ల మండలంలో నాగావళి నదీతీరం కోత ప్రధాన సమస్య. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో కోత సమస్యగా ఉంది. నది ఉధృతికి తీరం కోతకు గురవుతుంది. భవిష్యత్తులో కోత నియంత్రించాలంటే గ్రోయిన్లు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– బగ్గు రాజారావు, ఎంపీటీసీ, ధర్మవరం, ఎచ్చెర్ల మండలం

భక్తిశ్రద్ధలతో పూజలు



నీలమ్మతల్లికి పూజలు



ప్రత్యేక అలంకరణలో షిరిడి సాయినాథుడు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక జెడ్పీ ఎదురుగా ఉన్న ఏజీహెచ్‌బీ కాలనీలోని షిరిడిసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు గురువారం జరిగాయి. ఆలయ అర్చకులు పెంట శ్రీనివాసశర్మ, కిరణ్‌శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం అభిషేకాలు, మూడు రకాల హరతులతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నీలమ్మతల్లికి ప్రత్యేక పూజలు

పట్టణంలోని పెద్ద బరాటంవీధిలో వెలసిన నీలమ్మ తల్లి అమ్మవారికి గురువారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆలయ అర్చకులు పెంట కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక వస్త్ర అలంకరణ, పూలతో అలంకరణలు చేశారు. తదుపరి కుంకుమ పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు బరాటం సాయిరాజ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న బాల భాస్కరశర్మ

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట గ్రామంలో గల దేవీ ఆశ్రమంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఆలయ పీఠాధిపతి బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగానికి అభిషేకాలను నిర్వహించారు. సుహాసినీలతో ప్రత్యేక పూజలను చేయించారు. గోమాతను ప్రత్యేకంగా పూజించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీచక్రాల వద్ద కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాంఅక్కవలస గ్రామానికి చెందిన మాతా ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కొట్లాట కేసును ఎచ్చెర్ల పోలీసులు గురువారం నమోదు చేశారు. పాతకక్షలు, కుటుంబ కలహాల నేపథ్యంలో తమ ఇంటి సమీపంలో ఉన్న శ్రీను, మరో ఇద్దరు తనపై, తన తండ్రిపై బుధవారం రాత్రి దాడిచేసినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. రిమ్స్ వైద్యుల ఆరోగ్య నివేదిక ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

కాశీబుగ్గ: ప్రతీ శుక్రవారం కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్పీ గ్రీవెన్స్‌ను ఈనెల 17వ తేదీన రద్దు చేస్తున్నట్లు పోలీసు ఉన్నత అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా కేంద్రంలో పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్న కారణంగా హాజరు కాలేకపోతున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కాశీబుగ్గ పరిసర ప్రాంత ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

అభాగ్యులకు దుస్తుల పంపిణీ



ఇస్కాన్ స్వామీజీల చేతుల మీదుగా దుస్తుల పంపిణీలో దాత కన్నారావు

కాశీబుగ్గ: మందస మండలం వీవీఆర్‌పురంలో గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముక్కనుమ పురస్కరించుకొని వందలాది మందికి అన్నదానం చేసి, వస్త్రాలను గురువారం పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ కొర్ల కన్నారావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో అనేక మంది అనాథలు పాల్గొనగా ఇస్కాన్ స్వామీజీల చేతులమీదుగా వితరణ చేశారు. పలాస మండలం లొద్దభద్ర గ్రామానికి చెందిన కొత్తపల్లి చిన్నారావు గత ఇరవై ఒక్క సంవత్సరాలుగా దుస్తులు పంపిణీ కార్యక్రమం చేపడుతూ వస్తున్నారు. సుమారు 180 గిరిజనులకు దుస్తులతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

ఉత్సాహంగా డ్యాన్స్ పోటీలు



విజేతలను ప్రకటిస్తున్న రంగస్థల నటుడు కుమార్ నాయక్



ఇచ్ఛాపురం: డాన్స్ ఈవెంట్‌కి అధిక సంఖ్యలో హాజరైన ప్రేక్షకులు

కాశీబుగ్గ: మందస మండలం మామిడిపల్లి గ్రామంలో సంపత్ వినాయక సేవా సంఘం సౌజన్యంతో డాన్స్ ఢీ 2025 ఐకాన్ పోటీలు నిర్వహించారు. గ్రూప్, సోలో రెండు విభాగాల్లో పోటీలు గురువారం నిర్వహించగా 52 మంది కళాకారులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ఢీ 2019 విజేత మహేష్, ప్రముఖ రంగస్థలం నటుడు డాక్టర్ కుమార్‌నాయక్, వాసుదేవరావు, పాతినవేణు వ్యవహరించగా, వ్యాఖ్యతగా నాని అలరించారు. గ్రూపు విభాగంలో నస్ గ్రూపు ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా, ద్వితీయ బహుమతిని క్రేజీ గ్రూప్ కైవసం చేసుకున్నారు. సోలో విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు గీతిక, కిట్టు కైవసం చేసుకోగా, తృతీయ బహుమతి ఆనంగి శ్వేతకు దక్కింది. విజేతలకు బహుమతులను సేవాసమితి సభ్యులు తిరుమలరావు, కిరణ్, విష్ణుమూర్తి అందజేశారు.

ఇచ్ఛాపురం: సంక్రాంతి పురస్కరించుకొని పురపాలక సంఘం బెల్లుపడ గ్రామంలో శివానందగిరిపై త్రినాథస్వామి ఆలయం అభివృద్ధి కమిటీ సభ్యులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. గురువారం ఢీ–15 కొరియోగ్రాఫర్ కుమార్ మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాన్స్ ఈవెంట్ స్థానికులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఢీ కొరియోగ్రాఫర్ పండు మాస్టర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాంస్కృతిక కార్యక్రమాలను రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రేయ మిశ్రో నృత్య ప్రదర్శన



శ్రేయను సత్కరిస్తున్న రిటర్డ్ చీఫ్ ఇంజినీర్ సంపత్‌కుమార్

పాతపట్నం: స్థానిక ఆల్‌ఆంధ్రా రోడ్డు సమీపంలోని షిర్డీ గిరిపై ఉన్న షిర్డీసాయి బాబా మందిరంలో గురువారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలో పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన జాతీయ అవార్డు గ్రహీత, దివ్యాంగులు శ్రేయ మిశ్రా ప్రతిభ కనబరిచింది. శ్రేయ ప్లేటుపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యానికి పలువురు ప్రశంసల వర్షం కురిపించారు. రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ కొంచాడ సంపత్‌కుమార్ శ్రేయ మిశ్రోను సత్కరించారు. బాబా మందిరం కమిటీ సభ్యుడు తారకేశ్వరరావు, తదతరులు పాల్గొన్నారు.

వైభవంగా పైడితల్లి జాతర



పైడితల్లి దర్శనం కోసం బారులు తీసిన భక్తులు



పైడితల్లి అమ్మవారు

జి.సిగడాం: గెడ్డకంచరాం గ్రామంలో పైడితల్లి జాతర మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ నెల 15 నుంచి ఉత్సవాలు జరుగుతున్నాయి. స్థానిక ఎస్ఐ వై.మధుసూదనరావు భారీ బందోబస్తు నిర్వహించారు. సుదూరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. అమ్మవారికి ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు.

పేదలకు వస్త్రదానం



పేదలకు వస్త్రదానం చేస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మంలో సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు స్వగృహం వద్ద 500 మంది పేదలకు వస్త్రదానం చేశారు. మాజీ సర్పంచ్, వైస్ ఎంపీపీ బరాటం రామశేషు పేరిట చేపట్టిన ఈ కార్యక్రమంలో దుస్తులతో పాటు బియ్యం అందజేశారు. శ్రీకూర్మం ఉప సర్పంచ్ బరాటం జయలక్ష్మి, లీలావతి, శుభకర్, హాసినులు పేదలకు వస్త్రాలు అందజేశారు. 1984 నుంచి పేదలకు దుస్తులు, బియ్యం అందిస్తున్నామని, రామశేషు మృతితో రెండేళ్లు చేయలేకపోయామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు అందవరపు బాలకృష్ణమూర్తి, ఊట అప్పలనాయుడు, స్థానిక నాయకులు ఎల్‌వీ ప్రసాద్, పల్ల రాధాకృష్ణ, పట్నాల కోటి, పల్ల శ్రీను, జి. ఎర్రయ్య, పలువురు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



లక్ష్మణరావు, గణపతి, సీతారాంబాబును సత్కరిస్తున్న గ్రామస్తులు

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి అభివృద్ధే ధ్యేయంగా పనిచేసి యువతకు ఆదర్శంగా నిలుస్తున్న గ్రామ సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, ఆదిలక్ష్మి దంపతులను, ఉప సర్పంచ్ చందనాల గణపతిని, బాలబొమ్మ సీతారాంబాబును గ్రామస్తులు గురువారం సత్కరించారు. వీరి సొంత నిధులతో గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహంతోపాటు పార్క్, ఇతర మౌలిక సదుపాయలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల సన్యాసిరావు, పిల్లల శివకుమార్, తోలేటి వెంకటరావు, వాండ్రంగి వెంకటేష్, బాలబొమ్మ శ్రీనివాసరావు, సిర్రా గంగరాజు, చందనాల రంగారావు, తిరుపతిరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వాకలవలసలో ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని వాకలవలస గ్రామంలో గురువారం మహిళలకు ముగ్గుల పోటీలు, పాటలు పోటీలు, మధ్యాహ్నం బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, క్విజ్ పోటీలను గ్రామ పెద్దలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలిపొందిన వారికి స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రయాణ కష్టాలు..



శ్రీకాకుళం బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం నిత్యం వందలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. సంక్రాంతి, కనుమ తరువాత సుదూర ప్రాంతాలకు తిరిగి వెళ్లడంతో గురువారం రద్దీ మరింత పెరిగింది. గ్రామాలకు చేరేందుకు సకాలంలో ఆర్టీసీ సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికులు నరకయాతన పడ్డారు. బస్ షెల్టర్లు, కాంప్లెక్స్‌ల్లో పడిగాపులు కాశారు. కొందరు అధిక డబ్బులు చెల్లించి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. వివిధ ప్రాంతాల నుంచి పాతపట్నం కాంప్లెక్స్‌కు ప్రతీరోజు 30 నుంచి 40 వరకు బస్సు సర్వీసులున్నాయి.

పాతపట్నం నుంచి శ్రీకాకుళానికి 20 నిమిషాలకు ఒక ఆర్టీసీ సర్వీస్ ఉండేది. గురువారం ఉదయం నుంచి బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. ఆర్టీసీ బస్సులు ఒకేసారి రెండు, మూడు శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు పాతపట్నం కాంప్లెక్స్‌లో కనిపించాయి. శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, టెక్కలి, పలాస, పాలకొండ, ఒడిశాకు చెందిన బస్సులు వచ్చేవి. వీటితోపాటు ప్రైవేట్ బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ ప్రతీరోజు తిరుగుతున్నాయి. సంక్రాంతి సందర్భంగా దూరపు రూట్లకు బస్సులు వేయడంతో పాతపట్నం ప్రయాణికులకు కష్టాలు తప్పలేదు. ప్రైవేట్ బస్సుల హవా కనిపిస్తోంది.